కలుషిత నీటి సరఫరా సమస్యపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



తులసీనగర్‌లో పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల డయేరియా ప్రబలుతుందని, కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని అధికారులు పట్టించుకోవటం లేదని 'సాక్షి'లో కలుషిత నీటి సరఫరాను అరికట్టండని ప్రచురితమైన కథనానికి వాటర్‌వర్క్స్ అధికారులు స్పందించారు. సోమవారం తులసీనగర్‌లో వాటర్ లీకేజ్ అవుతున్న పైపులైన్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా తులసీనగర్ కాలనీవాసులు నీటి సమస్యపై 'సాక్షి'లో ప్రచురించినందుకు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయ నిధి అందజేత



సీఎం సహాయ నిధి చెక్కును అందజేసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్: ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది బిల్లులు కట్టలేని పేదవారికి సీఎం సహాయ నిధి ఆర్థికంగా అండగా ఉంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఫతేనగర్ డివిజన్‌లోని రైల్వేట్రాక్ వద్ద నివసిస్తున్న సంగేపులా బక్కయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆయన కుమారుడు శ్రీకాంత్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును సంప్రదించి తన తండ్రి ఆరోగ్య సమస్యను వివరించారు. ఆయన బండి రమేష్‌కు సమస్యను వివరించి నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించి రూ.1,75000ల సహాయ నిధి ద్వారా అందిన ఎల్‌ఓసీ పత్రాలను బాలానగర్‌లోని కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మయ్య, శ్రీకాంత్, లలిత పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం



విద్యార్థులకు కళ్లద్దాలను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని బాలవికాస పాఠశాలలో చదువుతున్న బధిరీ విద్యార్థులకు సహస్త్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. సహస్త్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారని, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు 130 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారని, వేయి మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. సంస్థకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. సహస్త్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కృష్ణకిషోర్, మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ప్రసాద్, జిల్లా గణేష్, ఆంజనేయులు, బాబుమోహన్, మల్లేష్, శ్రావణిరెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలో పనులను పరిశీలించిన బండిరమేష్

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్, మూసాపేట డివిజన్ పరిధిలోని రామారావునగర్, కబీర్‌నగర్, పాండురంగనగర్, స్నేహపురి కాలనీల్లో పలు నాలాలను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అధిక వర్షపాతం నమోదైన సందర్భంగా ఈ నాలాల పక్కన ఉన్న ప్రాంతాలు ముంపునకు గురి కావటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని, ఈ నేపథ్యంలో నాలా పరివాహక ప్రాంతాలను, ఇక్కడ జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలం నేపథ్యంలో నాలా పక్కన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలా పూడికతీత పనులను రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. నాలాల నిర్మాణానికి మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు బండి రమేష్ పేర్కొన్నారు. మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఎ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, సయ్యద్‌బాబు, గోపాల్‌రెడ్డి, గోషిశెట్టి రాఘవేంద్ర, డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్, సతీష్‌గౌడ్, డివిజన్ నాయకులు నరసింహయాదవ్, విఠల్‌రెడ్డి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో సతీష్‌గౌడ్, రాములు తదితరులు

బాలానగర్: భువనగిరి యాదాద్రి జిల్లా పిల్లాయపల్లి గ్రామంలో ఎరుకల నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి రాములు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, సీనియర్ నాయకుడు కన్నయ్య, రాజకుమార్, మహేందర్, సతీష్ తదితరులున్నారు.

సర్కారు బడులకు వసతులు కరువు

- ప్రైవేట్ పాఠశాలలకు మొగ్గు చూపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- నామమాత్రపు మరమ్మతులతో సరిపెడుతున్న వైనం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- రేపటి నుంచే ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం



వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణం

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలంటేనే వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు. అరకొర వసతులు, టీచర్ల కొరతతో సర్కారు బడుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం, కనీస వసతులు కల్పించటంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దీనిపై ప్రజా దప్రతినిధులు సైతం నిర్లక్ష్యం వహిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. (బడిబాట) ఆర్భాటం చేస్తున్నా.. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత, భవనాలు పాడైపోవటం వంటివాటికి భయపడి అధిక ఫీజులు ఉన్నా సరే ప్రైవేట్ పాఠశాలల్లోనే చేర్పిస్తామని తల్లిదండ్రులు తేల్చి చెబుతున్నారు. చదువు కొనలేని పేదవారు వారి పిల్లలను తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ.. కాలం వెళ్లదీస్తున్నారు.



పాఠశాలలోని తరగతి గది ఇలా..



ప్రమాదకరంగా విద్యుత్ మీటర్ బాక్స్



బబ్బుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఆల్విన్‌కాలనీ/మోతీనగర్: వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకున్నాయి. రెండ్రోజులైతే ఈనెల జూన్ 12 నుంచి సమస్యలతో తిరిగి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అల్లాపూర్ డివిజన్‌లోని కొత్తూరు సీతయ్యనగర్‌లో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. 103 మంది విద్యార్థులకు మూడు తరగతి గదుల అవసరం ఉంది.

- పర్వత్‌నగర్‌లో సుమారు 200 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు ఆరు తరగతి గదులు 6 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. చిన్నచిన్న మరమ్మతులు చేపడితే యథావిధిగా తరగతులు కొనసాగుతాయి.

సమస్యలతో స్వాగతం..

- అల్లాపూర్ తెలుగు మీడియం పాఠశాల రెండు తరగతి గదులు ఒకటి నుంచి ఆరు ఐదు తరగతుల వరకు, రెండు తరగతి గదులు ఒకటి నుంచి ఆరు, ఐదు తరగతులు వరకు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం క్రింద ఫ్లోరింగ్, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు.
- వండిట్‌నగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో 82 మంది విద్యార్థులు ఉన్నారు. 4 తరగతి గదులు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉన్నారు. అదనంగా నలుగురు ఉపాధ్యాయులు అవసరం.
- రామారావునగర్‌లో తెలుగుమీడియంలో 61 మంది విద్యార్థులు ఉండగా.. 1 నుంచి 5వ తరగతి వరకు ముగ్గురు ఉపాధ్యాయులు, రెండు తరగతిగదులు ఉన్నాయి.
- మూసాపేట డివిజన్ బబ్బుగూడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 340 మంది ఉన్నత పాఠశాలలో, సుమారు 15 మంది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉన్నారు. 6 తరగతి గదులు ఉన్నత పాఠశాలకు ఉన్నాయి. అదనంగా 4 తరగతి గదులు అవసరం.
- ప్రజా ప్రతినిధులు వారి వారి నియోజకవర్గాల్లో కమ్యూనిటీహాల్‌లో అంగన్‌వాడీ స్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసుతులు కల్పిస్తే కాలనీల్లో ఉన్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోకి వెళ్లి చదువుకోవటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నారు.
- కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట, వెంకటేశ్వరనగర్, రిక్షాపుల్లర్స్ కాలనీ, ఎల్లమ్మబండ, శంషీగూడ, హైదర్‌నగర్ పాఠశాలల్లో అరకొర వసతులతోనే ప్రభుత్వ పాఠశాలలు నెట్టుకొస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే పాఠశాల మైదానాలు చెరువులను తలపిస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



ఫ్లోరింగ్ పనులను పరిశీలించిన చైర్మన్ ఉమారాణి, ఏఈ ప్రసాద్

కనీస సౌకర్యాలు కరువు..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు కూడా లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో విద్యుత్ పరికరాలు, స్టేషనరీ, తాగునీటి సదుపాయం, లైట్లు, ఫ్యాన్లు కూడా లేకపోవటంతో దోమలబెడద, వర్షంపడితే కరెంట్ లేకపోవడంతో చీకట్లోనే చదువు కోవాల్సివస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

స్వచ్ఛంద సంస్థలకోసం..

స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఆయాలు, వాచ్‌మెన్‌లు లేకపోవటంతో పాఠశాలల్లో శుభ్రత లోపిస్తుందని, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చినప్పటికీ వారికిచ్చే అరకొర జీతాలతో ఎవరూ ముందుకు రావడం లేదని వాపోతున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి..

ప్రభుత్వం ముందుకొచ్చి ఉపాధ్యాయుల నియామకం, పాఠశాల సమస్యల పరిష్కారం, ఆయాల ఏర్పాటు వంటి విషయాలను పరిశీలించి నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాం..

వి. రామారావునగర్ మండల ప్రాథమిక పాఠశాలలో రెండు టాయిలెట్లు, గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్‌పై లీకేజీ కాకుండా ఫ్లోరింగ్, సంపు, వర్షం నీటి పైపులైన్, కరెంటు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్స్, కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచడం లాంటి తదితర మౌలిక వసతులు కల్పించాం.
- ఉమారాణి, విద్యా కమిటీ చైర్మన్



కొత్తూరు సీతయ్యనగర్ ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు



అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో..

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో) ఈ విధంగా ఉన్నాయి. టమాటా 45, వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, కాకరకాయ 45, బీరకాయ 55, క్యాబేజీ 23, బీన్స్ 85, క్యారెట్ 40, కాలిఫ్లవర్ రూ.28, దొండకాయ రూ.18, చిక్కుడుకాయ 65, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 25, క్యాప్సికం 65, ఆలుగడ్డ 35, కీరా 25, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ 18, కందగడ్డ 55, ఉల్లిపొరక 75, ఉల్లిగడ్డ 44, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 35, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగనూనె 165, పామాయిల్ రూ.97గా ఉన్నాయి.

నీట్ పరీక్షల్లో అన్యాయం



పవన్ కుమార్

ఆల్విన్‌కాలనీ: నీట్ పరీక్ష ఫలితాలు మే 14న ప్రకటిస్తామని చెప్పి, సరిగ్గా ఎన్నికల ఫలితాలు వెల్లడించే తేదీరోజే ఫలితాలు ప్రకటించటం 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' అక్రమాలకు పాల్పడిందని ఎన్‌టీఈఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాది రాష్ట్రాల వారికి గ్రేస్ మార్కులు ప్రకటించి తెలంగాణ రాష్ట్రాల వారికి గ్రేస్ మార్కులు కలపకపోవడం విద్యార్థులను మోసం చేయటమేనని విమర్శించారు. 23 లక్షల మంది విద్యార్థుల ఆవేదనను పట్టించుకుని తక్షణమే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. నీట్ పరీక్షను రద్దు చేయటమే కాకుండా ఎన్టీఏ సంస్థను కూడా రద్దుచేసి నీట్‌పరీక్షను తిరిగి నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదని మరో ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు.

కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు





కేంద్రమంత్రులు బండిసంజయ్, కిషన్‌రెడ్డిలతో ప్రేమకుమార్

కూకట్‌పల్లి: నూతనంగా కొలువదీరిన కేంద్ర మంత్రి వర్గంలో మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చోటు సంపాదించుకుని ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా సోమవారం కూకట్‌పల్లి జనసేన పార్టీ సీనియర్ నాయకుడు ప్రేమకుమార్ కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: చెరువులు పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామకుంట చెరువు ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మనిషి ప్రకృతితో మమేకమై జీవించినప్పుడే మనుగడ సాధ్యమన్నారు. భూగర్భ జలాల మట్టం పడిపోకుండా ఉండాలంటే చెరువులను కాపాడుకోవాలన్నారు. గతంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బండారి లేఔట్ అంటే ముంపునకు గురయ్యే ప్రాంతంగా ముద్రపడిందన్నారు. కాని గత పదేళ్ల కాలంలో ఎంతో ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ వరద ముంపును తొలగించడంతో నేడు ఇక్కడి ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

- ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తుర్క చెరువు, జంగారి కుంట, శ్రీరామ కుంట, ఎల్లంబాయి కుంటలకు సరిహద్దులను నిర్ణయించి చెరువు ఆక్రమణకు గురి కాకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో చెరువుల అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేసి పచ్చదనాన్ని పెంపొందిస్తామని తెలిపారు. అదే విధంగా వాకర్లకు అనువుగా ఉండేలా కాలిబాటలు, పర్యాటక ప్రాంతాలకు తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



నిజాంపేట్‌లోని శ్రీరామకుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఉచిత యునాని వైద్య శిబిరం

బాలానగర్: యునాని వైద్యం పట్ల ప్రజలు మొగ్గు చూపుతున్నారని యునాని వైద్యుడు షేక్ సుభాని అన్నారు. సోమవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజు కాలనీలో 'మిని స్టర్ ఫర్ ఆయుష్' ఆధ్వర్యంలో ఉచిత యునాని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ సుభాని మాట్లాడుతూ.. చర్మవ్యాధులు, బొల్లి మచ్చలు, కీళ్ల నొప్పులు, దీర్ఘకాలిక వ్యాధులు, బీపీ, షుగర్, సైనస్ వంటి వ్యాధులకు సంబంధించిన వారు వైద్య చికిత్సకు ఎక్కువగా సంప్రదిస్తున్నారన్నారు. సుమారు 50 మందికి పైగా ఈ శిబిరంలో పాల్గొన్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఫార్మాసిస్ట్ నాసర్, సహాయక సిబ్బంది కుమార్ తదితరులున్నారు.

నూతన పాఠశాల ప్రారంభం



తులసీనగర్‌లో పాఠశాలను ప్రారంభించిన ఏసీపీ హనుమంతరావు తదితరులు

కూకట్‌పల్లి: సాందీపని ఎడ్యుకేషనల్ సొసైటీ అనుబంధ సంస్థ 'లండన్ కిడ్స్ ప్లే స్కూల్'ను తులసీనగర్‌లో సతీష్‌కుమార్, సీహెచ్. రమేష్, ఎం. గోపిచారి, మహేష్, రవి, నరసింహాచారిల ఆధ్వర్యంలో ప్రారంభించారు. సోమవారం పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సూరారం సీఐ వెంకటేశం, బీసి జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ, తులసీనగర్-1 అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, తులసీనగర్-2 అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, న్యూటన్‌లు హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, ఝాన్సీరాణి, భారతిరెడ్డి, పూజాపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కేపీహెచ్‌బీకాలనీ: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి చూడగా.. మృతుడికి సంబంధించిన ఆధారాలు లభించలేదు. మృతుడికి సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నారు.